క్లుప్తంగా

త్రిశక్తి దేవాలయంలో శారికా శ్యామల పూజలు



విశేష అలంకరణలో మహాదుర్గ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి దేవాలయంలో మంగళవారం శారికా శ్యామల పూజలు చేశారు. శ్యామలా (గుప్త) నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లకు పూజలు చేశారు. వేకువజామున ఆలయ ప్రధానార్చకుడు ఫణి శర్మ నేతృత్వంలో మహాదుర్గ, మహాసరస్వతి, మహాదుర్గ అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్టీల్‌క్లబ్ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కార్యవర్గం

ఉక్కునగరం: ఉక్కు కనిష్ఠ అధికారుల మానసిక ఉల్లాస కేంద్రం (స్టీల్‌క్లబ్) నూతన కార్యవర్గం మంగళవారం బాధ్యతలు స్వీకరించింది. గత పాలకవర్గం కాలపరిమితి ముగియడంతో ఇటీవల ఎన్నికలు నిర్వహించారు. గెలిచిన నూతన కమిటీ క్లబ్ అధ్యక్షుడు, స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ ఎం. మధుసూదన రావు సమక్షంలో కార్యదర్శిగా పెంటకోట రామకృష్ణ , సంయుక్త కార్యదర్శిగా వై. రవికుమార్, కోశాధికారిగా డి. వేణుగోపాల్, కార్యవర్గ సభ్యులుగా పి.ఆర్.ఎస్. సాయిరవి, కె. రంగనాథం, ఎం. వెంకటరాజు, బి వెంకటరమణ, జె. రమేష్ కుమార్, రమేష్, వి. నాగభూషణరాజులు బాధ్యతలు స్వీకరించారు. క్లబ్ సభ్యుల సౌకర్యార్థం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.

కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టుమిషన్ల పంపిణీని ప్రారంభిస్తున్న బిషప్ మహంతి

గాజువాక: స్థానిక సీఎల్‌సీ మినిస్ట్రీస్ చైర్మన్ బిషప్ మహంతి ఆధ్వర్యంలో పేద మహిళలకు కుట్టు మిషన్లను మంగళవారం పంపిణీ చేశారు. మినిస్ట్రీస్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహంతి మాట్లాడుతూ పేద మహిళలు తమ కాళ్లపై తాము నిలబడే విధంగా తమ సంస్థ కృషి చేస్తోందని, అందులో భాగంగా కుట్టు మిషన్లను ఉచితంగా అందజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మినిస్ట్రీస్ సభ్యులు ఆల్‌ఫ్రెడ్ మహంతి, మెర్సీ మహంతి పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

గాజువాక: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక స్వామి విద్యానికేతన్‌కు చెందిన కూర్మమ్మ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన పెదగంట్యాడ ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారిణి డాక్టర్ పి.హేమలత క్యాన్సర్‌ను గుర్తించడం, నివారణకు చేపట్టాల్సిన చర్యలపై స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పి.దేవి, ప్రిన్సిపాల్ పాలూరి లక్ష్మణస్వామి, పాఠశాల ఇన్‌చార్జి గరిమెళ్ల పద్మజాపూర్ణ పాల్గొన్నారు.

15లోగా మండల కమిటీలు పూర్తి

గాజువాక: ఈనెల 15లోగా బీజేపీ మండల కమిటీలను పూర్తి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు అన్నారు. గాజువాకలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని సంస్థాగతంగా బలపర్చే విధంగా నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మేడపాటి రవీంద్ర, కరణంరెడ్డి నర్సింగరావు, డాక్టర్ గొర్లె సత్యనారాయణ, దీనంకొండ కృష్ణంరాజు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌షిప్ పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక: విశాఖ లైన్స్ షోటోకాన్ కరాటే డో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఆగస్టు 10న నిర్వహించనున్న మిద్దె లక్ష్మీనారాయణ మెమోరియల్ సౌత్ ఇండియా ఇన్విటేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోస్టర్‌ను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో అందరూ చురుగ్గా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ డి.ప్రేమ్ కుమార్, ఆర్గనైజర్లు మిద్దె వీరాంజనేయులు, జి.సి.ఎస్.వర్మ, న్యూకిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ అధ్యక్షుడు నూకరాజు పాల్గొన్నారు.

సాప్టవ క్రీడలపై క్రీనీడ!



జిమ్‌లో సాధన చేస్తున్న క్రీడాకారులు

బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, పవర్ లిఫ్టింగ్.. ఒకప్పుడు ఆదరణ కలిగిన క్రీడలు. యువత ఎక్కువగా ఆ క్రీడలపై మక్కువ చూపేవారు. పతకాలు కొల్లగొట్టేవారు. పతకాల సాధించిన వారిని సహచరులు, బంధువులు అభినందిస్తుంటే అవధుల్లేని ఆనందంతో ఉప్పొంగిపోయేవారు. వారిని చూసి మరికొంతమంది ప్రేరణ పొందేవారు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. శారీరక సాష్టవ క్రీడలు ఆదరణ కోల్పోతున్నాయి. ఎక్కడా టోర్నమెంట్‌ల జాడలేదు. పతకాల ఊసేలేదు. ఈ క్రీడల్లో సాధన చేస్తున్నవారు దాదాపు పదేళ్లుగా కనిపించని పరిస్థితి నెలకొంది. – గాజువాక

- ఆదరణ కోల్పోతున్న బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, పవర్ లిఫ్టింగ్
- పదేళ్లుగా జాడలేని టోర్నమెంట్లు
- క్రీడాకారుల్లో నిరాశ



బాడీ బిల్డర్‌కు వైవీ సుబ్బారెడ్డి అభినందన (ఫైల్)



వెయిట్ లిఫ్టర్ ప్రదర్శన

ఖర్చు.. కఠోర శ్రమ

ఈ క్రీడల్లో రాణించాలంటే కఠోర శ్రమతోపాటు ఖర్చు కూడా ఎక్కువగానే వెచ్చించాలి. బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, పవర్ లిఫ్టింగ్ వంటి క్రీడల్లో సాధన చేసేవారు అందుకు తగ్గ తిండి తినాలి. మాంసం, గుడ్లు, పాలు వంటి బలమైన ఆహారం తీసుకోవాలి. తిండికి తగ్గట్టు రోజూ రెండుపూటలా కసరత్తులు చేయాలి. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారుడు కనీసం అయిదేళ్ల పాటు ఇలా కఠిన సాధన చేయాలి. ఈ క్రీడల్లో ప్రవేశించేవారు అత్యధికశాతం పేద, మధ్యతరగతి వర్గాలకు చెందినవారే. దీంతో పెద్ద మొత్తంలో ఖర్చుచేసే అవకాశం లేకపోవడంతో సత్తా ఉన్నప్పటికీ సాధనవైపు వెళ్లడంలేదు.

గాజువాక క్రీడాకారులకు పతకాల పంట

బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, **పవర్ లిఫ్టింగ్ వంటి సాష్టవ క్రీడల్లో రాష్ట్ర,** జాతీయ **స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన వారిలో గాజువాక ప్రాంతానికి చెందినవారు అనే**కమంది **ఉన్నారు. మిస్టర్ విశాఖ, మిస్టర్ ఆంధ్రా** టైటిల్స్ కైవసం **చేసుకున్నవారు అధికమే. అయితే** ఈ క్రీడలకు **ప్రోత్సాహం తగ్గలేకపోవడంతో సాధన** చేస్తున్నవారు **తగ్గిపోతున్నారు. వేల రూపాయలు ఖర్చు**పెట్టి ఈ **క్రీడలో పతకాలు సాధిస్తున్నా సరైన ఉపా**ధి అవకాశాలు లేక చతికిలపడుతున్నారు. జాతీయ స్థాయిలో రాణించినవారు, మిస్టర్ విశాఖ, మిస్టర్ ఆంధ్రా స్థాయిలో పతకాలు సాధించినవారు కూడా కాంట్రాక్టు కార్మికులుగా పని చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సిన దుస్థితిలో ఉన్నారు.

గుర్తింపు లేక పోవడమే కారణం

మిగతా క్రీడలకు ఇచ్చే ప్రోత్సాహం తమకు దక్కడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధన చేసేవారు తగ్గిపోవడంతో చాలావరకు జిమ్‌లు కూడా మూతపడిపోయిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఉపాధి దొరకడం లేదు



ఎంతో కష్టపడి పతకాలు సాధించినా ఉపాధి కూడా దొరకడంలేదు. ఒక్క బాడీ బిల్డర్‌కు కేవలం సాధన చేయడానికే నెలకు రూ.5వేల వరకు ఖర్చవుతుంది. అంత మొత్తం భరించాలంటే ఏదో ఒక ఉపాధి ఉండాలి. పతకాలు సాధించిన క్రీడాకారులనైనా ప్రభుత్వం ఆదుకుంటే బాగుంటుంది. బాడీ బిల్డర్లుగా పతకాలు సాధించిన ఎంతోమంది కూలీలుగా, బౌన్సర్లుగా మిగిలిపోతున్నారు. సరైన జీవిత గమ్యం ఉండడం లేదు.

– కె.అప్పారావు, మిస్టర్ ఆంధ్రా టైటిల్ విజేత

ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం



బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, పవర్ లిఫ్టింగ్‌లు డైట్‌తో కూడిన ఆటలు. పోషకాహారాలు అందించాలి. ఫిట్‌నెస్ నిరంతరం కొనసాగించాలి. అందువల్ల సాధారణ కుటుంబాలకు చెందినవారు రాణించలేకపోతున్నారు. ఆర్థికంగా ఉన్నవారు మాత్రమే సాధన చేసి అంతర్జాతీయ పోటీలకు వెళ్లగలుగుతున్నారు. ఈ క్రీడలకు ప్రభుత్వాల నుంచి అనుకున్న ప్రోత్సాహం లేకపోవడంతో వారు కూడా ముందుకు రావడం లేదు. ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే సామాన్య కుటుంబాల నుంచి కూడా ప్రతిభావంతులైన క్రీడాకారులు తయారవుతారు.

– ఎస్.రాజారావు, అంతర్జాతీయ బాడీ బిల్డర్

క్రీడలు మరిచిపోతారు



గతంలో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు వచ్చేవి. ఇప్పుడు ఉద్యోగ నియామకాలే ఉండడంలేదు. అందువల్ల ఈ క్రీడలవైపు రావడం సమయం వృథా అవుతుందనే భావన ఉంది. క్రీడల్లో సాధన లేకపోవడంతో యువత చెడుమార్గాలవైపు వెళ్తోంది. యువతను చెడుమార్గాలకు వెళ్లకుండా ఆపగలిగేది క్రీడలే. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించాలి. పదేళ్లుగా టోర్నమెంట్లు కూడా జరగడంలేదు. ఫలితంగా ఈ క్రీడలను జనం మరిచిపోతున్నారు.

– బచ్చుల త్రిమూర్తులు, బాక్సింగ్ కోచ్

బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం



పూర్ణానందశర్మను సత్కరిస్తున్న 85వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

అగనంపూడి: బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి సహకారం అందివ్వాలని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ (పూర్ణ) అన్నారు. అగనంపూడిలోని పార్టీ కార్యాలయంలో 85వ వార్డు పార్టీ నాయకులు మంగళవారం కలిసి పూర్ణను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కింది స్థాయిలో పార్టీ బలంగా ఉన్నప్పుడే బూత్‌స్థాయిలో పటిష్టం అవుతుందన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు విసిగెత్తి ఉన్నారని..వారికి అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో ఎల్.వి.రమణ, సేనాపతి నరసింగరావు, విందుల వరప్రసాద్, యలమంచిలి అప్పారావు, వరహా వెంకటరావు, పట్టా రామకృష్ణ, కృష్ణప్రసాద్, చిత్తా ప్రసాద్, పి.సురేష్, నరసింహరాజు, గురు గిరీష్, దువ్వాడ గణేష్, కరణం సంతోష్‌కుమార్, అప్పారావు పాల్గొన్నారు.

552 మందికి వైద్య సేవలు



వైద్య శిబిరంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జీవీఎంసీ కమ్యూనిటీ హాల్లో మంగళవారం వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ , ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 552 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందజేశారు. బీపీ, షుగర్, ఈసీజీతో ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి ఆస్పత్రి ఆధ్వర్యంలో పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎం.ఎస్.ఎల్.రాజు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంద్రాన నూకరాజు, వరదాడ వెంకటరమణ, జెడ్పీ హై స్కూల్ హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, పీడీ ఇస్మాయిల్, సతీష్, మళ్లా కుమార్, వైద్యులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శ్రావణ్ కుమార్, డాక్టర్ భాగ్యరాజ్, డాక్టర్ కల్పన, క్యాంప్ కో – ఆర్డినేటర్లు వెంకట్, రుచిత, పి.సిద్ధూ పాల్గొన్నారు.

అప్పికొండ తీరంలో భారీ ఏర్పాట్లు


మహా శివరాత్రి ఉత్సవాలపై ఆర్డీవో శ్రీలేఖ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీలేఖ

పెదగంట్యాడ: అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో పి.శ్రీలేఖ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 26న శివరాత్రి రోజున ఇక్కడకు భారీ ఎత్తున భక్తులు తరలి వస్తారన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు బందోబస్తు నిర్వహించాలన్నారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలాన్ని శుభ్రం చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. భక్తుల కోసం పకడ్బందీగా క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ వారు ప్రత్యేకంగా బస్సులు నడపాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఆలయ ఈవో శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ శేషాద్రి, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌భాస్కర్, దువ్వాడ సీఐ కె. మల్లేశ్వరరావు, స్టీల్‌ప్లాంట్ సీఐ కేశవరావు, నాయకులు శివకుమార్, ఎంపీ రెడ్డి, అప్పలరెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు వనము అప్పలనాయుడు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

నడుపూరు విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్

పెదగంట్యాడ: ఎడ్యుకేషన్ ఎపిఫనీ అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన మెరిట్ పరీక్షలో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న వి.దుర్గాగణేష్ ప్రథమ స్థానంలో, పవన్ కుమార్ ద్వితీయ స్థానంలో నిలిచాడన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.8వేలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ.6వేల వంతున స్కాలర్‌షిప్ అందజేయనున్నారని వివరించారు. విద్యార్థులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు నరసింహ, కస్తూరి కిరణ్, శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, షేక్ బాజీ, షర్మిల, వరలక్ష్మి, నారాయణరావు, పలక మాధవిని అభినందించారు.

విశాఖ ఉక్కుపై కేంద్రం నాటకాలు



శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ ప్రతినిధులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్ర ప్రభుత్వం నాటకాలు ఆడుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ చైర్మన్ డి. ఆదినారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగానే కర్మాగారంలో అతి కీలకమైన సీఐఎస్ఎఫ్ విభాగంలో వందలాది మంది సిబ్బందిని ప్రభుత్వం తొలగించిందని ఆయన పేర్కొన్నారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1454 రోజులకు చేరుకున్నాయి. శిబిరాన్ని సందర్శించిన ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంపై కేంద్ర ప్రభుత్వం నేటికీ స్పష్టమైన ప్రకటన చేయలేదన్నారు. 463 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బందిని వేరే ప్రాంతాలకు బదిలీ చేయడం అన్యాయం అన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగార రక్షణలో కీలకంగా వ్యవహరిస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బందిని తొలగించడం ఎంత వరకూ సమంజసం అని ప్రశ్నించారు. ఇటువంటి చర్యల వల్ల ఉక్కు ఉద్యోగుల మనోభావాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు తప్పుడు విధానాలు విడనాడి ఉక్కు కర్మాగార ప్రగతికి నడుంబిగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఎంకేవీ రాజేశ్వరరావు, జి. ఆనంద్, రమేష్, నంబారి సింహాద్రి, ఎం. త్రినాథ్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉక్కు ఉద్యోగికి గాయాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు సమీపంలో బైక్‌పై వెళ్తున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగిని కారు ఢీకొనడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ థర్మల్ పవర్ ప్లాంట్ విభాగంలో జనరల్ ఫోర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్.ఎస్.కె.వి. శివకుమార్ ఈనెల 3న ఉదయం షిఫ్ట్‌కు విధులకు వెళ్లారు. విధులు ముగించుకుని బైక్‌పై పైలాన్ ప్రాజెక్ట్ ఆఫీసు కార్యాలయం వైపు మలుపు తిరిగి వెళ్తుండగా కూర్మన్నపాలెం నుంచి ప్లాంట్ వైపు వేగంగా వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో శివకుమార్‌కు కుడి కన్ను, ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. తదుపరి చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నమో సూర్యభగవాన్

ఘనంగా రథసప్తమి పూజలు



శ్రీవారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగిస్తున్న తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు

పెదగంట్యాడ: రథసప్తమి వేళ భానుడిని భక్తితో కొలిచారు. పుణ్యస్నానాలు ఆచరించి అర్ఘ్యం సమర్పించారు. ప్రత్యేకంగా తయారు చేసిన పొంగలిని ఆదిత్యుడికి అందించారు. ఆలయాల్లో సైతం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- జీవీఎంసీ 76వ వార్డు బాలచెరువులోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో విశ్వ హిందూ పరిషత్ నాయకులు జీలకర్ర రమణ, భువనేశ్వరి దేవి ఆధ్వర్యంలో సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు వాసుదేవ శర్మ మాట్లాడుతూ సమస్త జీవ కోటి ఆహారం అందించేది ప్రత్యక్ష దైవం సూర్యభగవానుడని చెప్పారు. బీజేపీ నేత కరణంరెడ్డి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.
- హౌసింగ్ బోర్డు కాలనీలో యువ హిందూ సాంస్కృతిక సంఘ్ ఆధ్వర్యంలో సూర్య భగవానుడికి పూజలు చేశారు. ఉమేష్‌సింగ్, జితేంద్ర వర్మ, ఉమేష్ శర్మ పాల్గొన్నారు.
- హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో రథ సప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, మెగలపల్లి త్రిమూర్తులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై ఊరేగిన శ్రీవారు

అక్కిరెడ్డిపాలెం: రథసప్తమిని పురస్కరించుకుని షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశుడిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



దానపప్పతల్లికి పూజలు చేస్తున్న బొడ్డ గోవింద్

కూర్మన్నపాలెం: వడ్లపూడి కణితి నిర్వాసిత కాలనీలోని దానప్ప దేవాలయానికి పరిసర ప్రాంతాల ప్రజలు భక్తులు హాజరై అమ్మవారికి పూజలు చేసి కానుకలు సమర్పించారు. అనంతరం సూర్యునికి నమస్కారాలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీ 87వ వార్డు అధ్యక్షుడు బొడ్డ గోవింద్, స్థానిక నాయకులు చిత్రాడ వెంకటరమణ, నరసింహమూర్తి, సుజాత అమ్మవారిని దర్శించుకున్నారు.



బాలచెరువు శివాలయంలో పూజలు



అగనంపూడి జాబిలీహిల్స్ ఆలయంలో పూజలు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు జాబిలీహిల్స్ ఆలయ ఆవరణలో సూర్య నమస్కారాలు ఆచరించి తర్వాత ఆవు పిడకలతో స్వామి వారికి ఇష్టమైన పొంగలి తయారు చేసి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ అర్చకులు ఆంజనేయులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మూర్తి, మణి, శంకరరావు, గొల్లవిల్లి వెంకటరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు దరి ఉమారామలింగేశ్వర స్వామి ఆలయలో మంగళవారం రథసప్తమి పూజలు ఘనగా నిర్వహించారు. ఆలయ ఆవరణలోని సూర్యనారాయణ మూర్తి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎల్లేటి శ్రీనివాస్, సురేంద్ర, నడుపూరు శ్రీనివాస్, కనకరెడ్డి, శశిభూషణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు



విద్యార్థితో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

గాజువాక: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఇళ్లను మంగళవారం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సందర్శించారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులతో మాట్లాడి చదువుతున్న పద్ధతులను, చదువుకోవడానికి కేటాయిస్తున్న సమయం తదితర అంశాలపై ఆరా తీశారు. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లను సందర్శించిన ఉపాధ్యాయులు రానున్న పరీక్షల్లో ఉత్తమ శ్రేణి మార్కులను సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా తమ బోధన కొనసాగుతోందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.విజయ ప్రశాంతి తెలిపారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న రెడ్డీస్ ల్యాబ్స్ ప్రతినిధులు

గాజువాక: రెడ్డీస్ ల్యాబ్స్‌లో ఉద్యోగాల భర్తీకి స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. ఇంటర్వ్యూల్లో 500 మంది అభ్యర్థులు పాల్గొనగా, 240 మంది అభ్యర్థులు ప్రాథమిక అర్హత పరీక్షకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తెలిపారు. ఇంటర్వ్యూలను కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్డీస్ ల్యాబ్స్ అధికారులు లక్ష్మీ దీపక్ దాసరి, గవర సోమశేఖర్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.తేజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.